
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
మంగళవారం 7 మే 2024



## నేడు మెదక్‌కు మాజీ సీఎం కేసీఆర్

మెదక్, మే 6: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర మంగళవారం రాత్రి మెదక్ పట్టణానికి చేరుకోనుంది. కామారెడ్డి జిల్లా నుంచి రాత్రి 8 గంటలకు బస్సుయాత్ర మెదక్ పట్టణంలోకి ప్రవేశిస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రాందాస్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. బుధవారం నర్సాపూర్‌లో బస్సుయాత్ర కొనసాగనుంది. 10వ తేదీన సిద్దిపేటలో ముగింపు సభ నిర్వహించనున్నారు.



జీజీహెచ్ పోస్టుమార్టం రూమ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

## ఇక్కడ లంచాలు ఇవ్వొద్దు

- సర్కారు దవాఖానాలో ఫ్లెక్సీలు
- పోస్ట్‌మార్టంకు రేటంటూ ఫిర్యాదులు
- స్పందించిన అధికారులు

6లో

## జిల్లాలో 60 మోడల్ పోలింగ్ కేంద్రాలు

- సంగారెడ్డి డీఆర్డీవో జ్యోతి



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో జ్యోతి

సంగారెడ్డి రూరల్, మే 6: లోక్‌సభ ఎన్నికలకు సంగారెడ్డి జిల్లాలో 60 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు డీఆర్డీవో జ్యోతి తెలిపారు. సంగారెడ్డిలోని గ్రామీణ అభివృద్ధిశాఖ కార్యాలయంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జిలు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఎన్నికల నాటికి అన్ని వసతులు కల్పించి పండుగ వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, డీపీఎంలు మల్లేష్, శ్రీనివాస్, రవీందర్, జయశ్రీ, ఏపీఎంలు వెంకట్, బాలకృష్ణ, రాజశేఖర్, శివకుమార్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి దొంగల హల్‌చల్

**చుట్టుముట్టిన పోలీసులు, స్థానికులపై దాడి చేస్తూ పరారీ**

తూప్రాన్, మే 6: మెదక్ జిల్లా తూప్రాన్‌లో పోలీసులపై రాళ్లు, రాడ్లతో దాడి చేస్తూ దొంగలు పారిపోయారు. కాలనీవాసులు వెంటాడుతున్నా.. వారిపైనా దాడి చేశారు. కాలనీవాసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలోని కిందివాడకట్టు శ్రీరాంనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి ముగ్గురు దొంగలు చొరబడ్డారు. వారి అలజడి గుర్తించిన పక్కింటి మహిళ ఇంట్లోకి దొంగలు చొరబడ్డ విషయాన్ని కాలనీవాసులకు సమాచారం అందించింది. దీంతో కాలనీవాసులంతా జహంగీర్ ఇంటిని చుట్టుముట్టారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు కాలనీవాసులపై రాళ్లు, రాడ్లతో దాడి చేస్తూ పారిపోయారు. అయినప్పటికీ కాలనీవాసులు దొంగలను వెంబడించారు. అదే సమయంలో బైక్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు రావడంతో.. వారు విషయం తెలుసుకుని దొంగల వెంటపడ్డారు. అయితే, ఓ కానిస్టేబుల్ దొంగలను వెంబడిస్తూ ముందుకు వెళ్లగా అతడిపై రాడ్‌తో, రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆయన కొంత వెనక్కి తగ్గారు. అలాగే, కాలనీకి చెందిన ఒకరు ముందుకు వెళ్లగా.. అతడిపైనా రాళ్లతో దాడి చేసి పరారయ్యారు. వచ్చిన ముగ్గురు దొంగల్లో ఇద్దరు ముఖానికి మాస్కులు, జర్కిన్ ధరించి ఉండగా.. ఓ దొంగ చెడ్డీపై ఉన్నాడు. అయితే, పోలీసుపై దొంగలు దాడి చేసిన విషయాన్ని పోలీసులు నిర్ధారించడం లేదు.



## పారిశ్రామికవాడ మద్దతు ఎవరికో?

- వలస కార్మికుల ఓట్లపై పార్టీల ఫోకస్
- ఇతర ప్రాంతాల ఓటర్ల ఆదరణపై ఆశలు

6లో

## కోస్ట్‌గార్డ్‌కు సీఆర్ఎన్ గన్స్ సరఫరా

- మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారీ
- ఒప్పందంపై న్యూఢిల్లీలో సంతకాలు

6లో

వాహనాల తనిఖీలో రూ.2 లక్షలు సీజ్ 7లో

# మాటైనా చెప్పరా?





## కాంగ్రెస్‌లో చేరికలపై గుస్సా!

- పట్టించుకోని ముఖ్యనేతలు
- కొత్త నేతల రాకతో పాత నేతలు ప్రచారానికి 'నో'
- అక్కడా.. ఇక్కడా వారిదే పెత్తనమంటూ కినుక
- ఇన్‌చార్జిలను విస్మరిస్తున్నారని ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 6: ఎడాపెడా చేరికలతో నూతనోత్సాహం ఏ మేరకు వస్తుందో అంతేస్థాయిలో ఇప్పటివరకు ఉన్న నాయకులు అసంతృప్తికి లోనవుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఈ పరిస్థితే నెలకొన్నది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లో ఉండి, తమపై పెత్తనం చెలాయించిన నాయకులు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లో చేరి అధికారం చెలాయిస్తామంటే ఊర్కొనేది లేదని వారు హెచ్చరిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి ఎంత మంది నాయకులు వస్తే అంత మందిని కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని రాష్ట్ర నాయకత్వం నుంచి ఆదేశాలున్నాయని పార్టీ జిల్లా ముఖ్య నాయకుడొకరు చెబుతుండడం.. ఇంత వరకు పార్టీని అంటిపెట్టుకున్న వారిని నిరాశ నిస్పృహలకు గురి చేస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో పార్టీ ముఖ్య నేత ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు చెందిన వారిని చేర్చుకోరాదని ఇప్పటివరకు ఉన్న నాయకులు పట్టుబట్టారు. అయితే సదరు ముఖ్య నేత మాత్రం 'కొత్త వారిని చేర్చుకునేందుకు పార్టీ నాయకత్వం ఆదేశాలున్నాయని, మీ ఇష్టం ఉంటే పార్టీలో ఉండండి లేకపోతే వెళ్లిపోండి' అని కటువుగా మాట్లాడినట్టు తెలిసింది. దాంతో నొచ్చుకున్న పార్టీ నాయకులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. సరే ఎన్నికల్లో మన సంగతి మనం చూపిద్దాం అంటూ వారు ప్రచారానికి దూరంగా, మౌనంగా ఉండి పోయినట్టు తెలిసింది. ముఖ్యంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎక్కువ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నది.

### పాతకాపుల ప్రమేయం లేకుండానే..

ఉమ్మడి మెదక్ జిల్లాలో పాత కాపుల ప్రమేయం లేకుండానే బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూనే ఉన్నారు. మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌కు కనీసం మాటమాత్రమైనా చెప్పకుండానే అక్కడి బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. పీసీసీ అధ్యక్షుడైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీసీసీ అధ్యక్షులను పట్టించుకోవడం లేదంటూ పార్టీ వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. మెదక్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ప్రసగించిన అక్కడి డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేరును ప్రస్తావించకపోవడం ఆయన వర్గీయులకు ఆవేదన కలిగించింది. సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ నేతలు ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులను పార్టీలో చేర్చుకునే క్రమంలో ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో చర్చించకపోవడం వారికి మింగుడు పడడం లేదు. ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు పాల్గొన్నప్పుడు మాత్రం అసంతృప్తిలో ఉన్న నేతలు మొక్కుబడిగా పాల్గొంటున్నారు తప్ప ఆ తర్వాత పార్టీ కోసం వారెవరూ ప్రచారం నిర్వహిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

### బూత్ కమిటీలకు అందని డబ్బులు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు బూత్ కమిటీలకు ఇప్పటివరకు డబ్బు అందలేదని తెలిసింది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఒక్కో బూత్ కమిటీకి పదివేల నుంచి ఇరవైవేల రూపాయల వరకు పంపిణీ చేసినట్టు తెలిసింది. బూత్ కమిటీలకు డబ్బు అందితేనే ఆ పోలింగ్ బూత్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి, పోల్ స్లిప్‌లు, ప్రచార కరపత్రాలు అందించి ఓట్ల కోసం ఓటర్లను అభ్యర్థించే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్‌లో ఇప్పటి వరకు బూత్ కమిటీలకు డబ్బులు రాలేదని ప్రచారం ఎలా చేసేదని ఆ పార్టీ వర్గాలే ప్రశ్నిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలే గెలిపిస్తాయన్న ధీమాతో తమ అభ్యర్థి ఉన్నాడని ఆ పార్టీ వర్గాలున్నాయి. అందువల్ల జయాపజయాలు అభ్యర్థి వ్యవహార సరళిపైనే ఆధారపడి ఉన్నాయని ఆ వర్గాలంటున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి కనబరిచే వారితో అభ్యర్థి నేరుగా మాట్లాడి ఒప్పిస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. చేరికలను ప్రోత్సహిస్తూ, మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించడం తప్ప గ్రామ, పట్టణ స్థాయిలో ఓటర్లను కలుసుకునే ప్రయత్నం జరగడం లేదని ఆ వర్గాలు ఒకింత ఆవేదన వ్యక్తం చేశాయి. ఏమైనా పోలింగ్‌కు ఇక వారం రోజులే ఉన్నందున ఇప్పటికైనా ప్రచారం సరైన దశలో సాగాల్సిన అవకాశం ఎంతైనా ఉన్నదని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పీఎంశ్రీ కింద 19 స్కూళ్లు

**రెండో విడత జాబితా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**

**సంగారెడ్డి జిల్లాలో తొలి విడతలో 25 బడుల ఎంపిక**

**ప్రతీ పాఠశాలకు రూ.2 కోట్ల నిధులు**



పీఎంశ్రీ కింద ఎంపికైన సంగారెడ్డి పోలీస్‌లైన్‌లోని ప్రైమరీ స్కూల్

సంగారెడ్డి అర్బన్, మే 6 : జిల్లాలోని పాఠశాలలకు సదుపాయాల దృష్ట్యా మహర్దశ పట్టనుంది. పీఎంశ్రీ పథకంలో భాగంగా పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించనున్నారు. సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. తొలివిడతలో సంగారెడ్డి జిల్లాలోని 25 పాఠశాలలను ఎంపిక చేసింది. రెండోవిడతలో మరో 19 పాఠశాలలను పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేస్తూ పాఠశాలల సోమవారం జాబితా విడుదల చేసింది.

### ఎంపికైన పాఠశాలలు ఇవే..

పీఎంశ్రీ కింద రెండో విడత ఎంపికైన పాఠశాలల్లో బీహెచ్ఈఎల్ జడ్పీహెచ్ఎస్, ఇస్నాపూర్‌లోని టీఎస్ఆర్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ (గర్ల్స్), కొండాపూర్‌లోని టీఎస్ఆర్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ (బాయ్స్), న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్, సిరిపుర జడ్పీహెచ్ఎస్, మునిపల్లి టీఎస్ఎంఎస్, దిగ్వాల్ జడ్పీహెచ్ఎస్, నాగల్‌గిద్ద టీడబ్ల్యుఆర్ఈఐఎస్ (గర్ల్స్), కంది మండలం చెర్యాల్ జడ్పీహెచ్ఎస్, నారాయణఖేడ్ మండలం చాప్టా-కె జడ్పీహెచ్ఎస్, గుమ్మడిదల మండలం బొంతపల్లి జడ్పీహెచ్ఎస్, చౌటకూర్ మండలం శివంపేట జడ్పీహెచ్ఎస్, సదాశివపేట జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్), అందోల్ మండలం నేరేడిగుంట జడ్పీహెచ్ఎస్, అమీన్‌పూర్ కిష్టారెడ్డిపేట జడ్పీహెచ్ఎస్, అమీన్‌పూర్ జడ్పీహెచ్ఎస్, మొగుడంపల్లి మండలం అసద్‌గంజ్ జడ్పీహెచ్ఎస్, నిజాంపేట మండలం బాచేపల్లి జడ్పీహెచ్ఎస్, సంగారెడ్డి పోలీస్‌లైన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.

### ఆధునిక హంగులు

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన ప్రతీ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భాగస్వామ్యంతో రూ.2 కోట్ల నిధులను సమకూర్చుతాయి. ఏటా రూ.40 లక్షల చొప్పున ఐదేళ్ల పాటు ఈ నిధులు విడుదలవుతాయి. ఆ నిధులతో పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్య, సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తారు. భౌతిక, మానవ వనరులతో పాటు వృత్తివిద్యా కోర్సులు, నైపుణ్యాభివృద్ధి పెంపునకు కావలసిన చర్యలు తీసుకుంటారు.

# తగ్గని భగభగలు

- కొనసాగుతున్న భానుడి ఉగ్రరూపం
- సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 45.5 డిగ్రీలు, సిద్దిపేటలో 45.4 డిగ్రీలు
- మూడు ప్రాంతాలకు రెడ్‌అలెర్ట్

మెదక్ అర్బన్, మే 6: ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. ఎండలు రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. రికార్డుస్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి దిగ్వాల్‌లో సోమవారం 45.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదయింది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 45.5 డిగ్రీలు, సిద్దిపేటలో 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మూడు ప్రాంతాల్లో వాతావరణశాఖ రెడ్‌అలెర్ట్ జారీ చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు తోడు వడగాలులు వీస్తుండడంతో జనం ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, వృద్ధులు, గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# మెదక్ జిల్లా ముద్దుబిడ్డ కేసీఆర్

- ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ ఇది
- కేసీఆర్‌ను విమర్శిస్తే ప్రజలను అవమానించినట్టే
- ఫేక్ వీడియోలతో లబ్ధిపొందేందుకు బీజేపీ కుట్ర
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నర్సాపూర్, మే 6: కేసీఆర్ మెదక్ ఉమ్మడి జిల్లా ముద్దుబిడ్డ అని, ఆయన గురించి ఇష్టానుసారం మాట్లాడడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా ప్రజలను అవమానిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. నర్సాపూర్‌లో పార్లమెంటు ఎన్నికల ప్రచారసరళిపై నియోజకవర్గ ముఖ్యనాయకులతో సోమవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయలేదని విమర్శించారు. వారి వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్‌పై తిట్ల పురాణం అందుకుంటున్నాడని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు రాసిచ్చిన బాండ్‌పేపర్లు ఇప్పుడు బౌన్స్ అయ్యాయని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయనందుకు క్షమాపణ చెప్పాల్సిందిపోయి మరోసారి ఆగస్టు 15 లోపు అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాను అబద్ధాలు చెప్పడమే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో కూడా అబద్ధాలు చెప్పిస్తున్నారని మాజీమంత్రి మండిపడ్డారు. అబద్ధాలతో లబ్ధిపొందాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను రద్దుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోసారి కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లా ప్రజలు నష్టపోతారని హెచ్చరించారు.

### పదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదు

పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని హరీశ్ విమర్శించారు. మతం పేరిట ఓట్లు దండుకోవడం తప్ప పేదల గురించి ఆలోచించలేదని అన్నారు. తెలంగాణకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎన్నికలకు ఒకట్రెండు రోజుల ముందు ఫేక్‌వీడియోలు, అబద్ధపు ప్రచారాలను వ్యాప్తిచేసి లబ్ధిపొందాలని కుట్ర చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో దుబ్బాకలో ఎన్నిక సమయంలో కూవిదేవిధంగా ఫేక్ వీడియోలతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఈసారి ఎన్నికల ముందు వచ్చే ఫేక్‌వీడియోలు, సోషల్‌మీడియా ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై తప్పుడు ప్రచారం చేసి బీజేవైఎం నాయకుడిపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన సాయంత్రం నర్సాపూర్‌లో రోడ్‌షోలో కేసీఆర్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, జడ్పీటీసీ బబియానాయక్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నాయకులు చంద్రాగౌడ్, సింగాయపల్లి గోపి, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేఖర్, రమణాగౌడ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు బీఆర్ఎస్ : హరీశ్‌రావు



పటాన్‌చెరులో పార్టీ నాయకుల సమావేశంలో హరీశ్‌రావు

పటాన్‌చెరు, మే 6: మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త, నాయకుడు గడపగడపకు వెళ్లి ప్రచారం చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 8న నిర్వహించనున్న కేసీఆర్ రోడ్‌షోకు జనసమీకరణపై పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నియోకవర్గ ముఖ్య నాయకులతో కలిసి ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ప్రతీ గడపకు వెళ్లి కాంగ్రెస్, బీజేపీ మోసాలను వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి భారీ మెజారిటీ తెచ్చేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ రోడ్‌షోకు గ్రామాలు, మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ డివిజన్ల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేయాలని నిర్దేశించారు. కేసీఆర్ రోడ్‌షోకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.

# కోస్ట్‌గార్డ్‌కు సీఆర్ఎన్ గన్స్ సరఫరా

## మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారీ... ఒప్పందంపై న్యూఢిల్లీలో సంతకాలు

కంది, మే 6 : సాయుధ దళాల కోసం యుద్ధ వాహనాలను, అణ్వాస్త్రాలను అధునాతన సాంకేతికతతో అందించిన మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తొలిసారిగా ఇండియన్ కోస్టగార్డ్‌కు 10 సీఆర్ఎన్ (క్లోజ్డ్ రేంజ్ నావెల్-91) మోడల్ గన్స్ సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నది. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఏవీఎన్ఎల్ (ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్) జీఎం బాబ్జీ, కోస్టగార్డ్ డీఐజీ బిభూతి రంజన్ సోమవారం న్యూఢిల్లీలోని కోస్టగార్డు హెడ్ క్వార్టర్స్‌లో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇండియన్ కోస్టగార్డ్ పరిధిలో 160 షిప్‌లు, దాదాపు 100కుపైగా హెలికాప్టర్లు ఉన్నాయి. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వాటి రక్షణకు సంబంధించిన అణ్వాస్త్రాలను కొన్నేళ్లుగా అందిస్తున్నది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తయారు చేసే సీఆర్ఎన్ గన్స్ 30ఎంఎం ఆటోమెటిక్ నావెల్ వెర్షన్ కలిగి, సముద్ర తీరంలోని షిప్‌లలో నుంచి 2 కిలోమీటర్ల రేంజ్‌లో శత్రుమూకలపై దాడి చేయగలవని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ జీఎం బాబ్జీ తెలిపారు. అంతేగాక ఆటోమెటిక్ నావెల్ వెర్షన్‌తో పనిచేసే ఈ గన్ ఎలక్ట్రో ఆప్టికల్ ఫైర్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా పగలు, రాత్రి పనిచేయగలదని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణరంగానికి వెన్నుముకగా మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉందని మరోసారి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు తమ ఘనత చాటారు. ఈ సందర్భంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ జీఎం బాబ్జీ మాట్లాడుతూ ఏవీఎన్ఎల్ మెదక్ యూనిట్‌లో టీ-90 ట్యాంకు, టీ-72 ట్యాంక్, బీఎంపీ-2, ఎంబీటీ అర్జున్ వంటి ప్రముఖ ఉత్పత్తులను సాయుధ దళాల కోసం తయారు చేస్తున్నామన్నారు. దేశ రక్షణ కోసం అవసరమైతే అణ్వాస్త్రాలతో పాటు యుద్ధ వాహనాలను తయారు చేస్తామని తెలిపారు. ఇప్పటికే తాము తయారు చేసిన సీసీపీటీ యుద్ధట్యాంకర్ అత్యాధునిక జీపీఎస్, నావిగేషన్ కమ్యూనికేషన్ వ్యవస్థ కలిగి ఉందన్నారు. ఇది నీటిలో, గతుకుల రోడ్లపైన, గుట్టలపైన, బురద నేలల్లో, ఎలాంటి కొండ ప్రాంతంలోనైనా వేగంగా ప్రయాణించగలదని ఆయన పేర్కొన్నారు. అంతేగాక యుద్ధరంగంలో ఇది తిరుగులేని శక్తిగా ఉంటుందన్నారు. శత్రువుల దాడి నుంచి ఎలాంటి బుల్లెట్లు, గ్రానైడ్లు, బాంబులైనా తట్టుకునేలా ధృడమైన ఉక్కుతో ఈ ట్యాంకర్ బాడీని నిర్మించామని తెలిపారు. త్వరలోనే మరిన్ని సీసీపీటీ యుద్ధట్యాంకర్‌లను సైన్యానికి అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ జీఎం బాబ్జీ, ఇండియన్ కోస్టగార్డ్ డీఐజీ బిభూతి రంజన్

# ఇక్కడ లంచాలు ఇవ్వొద్దు

- సర్కారు దవాఖానాలో ఫ్లెక్సీలు
- పోస్టుమార్టంకూ రేటంటూ ఫిర్యాదులు
- స్పందించిన అధికారులు

సంగారెడ్డి అర్బన్, మే 6 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రక్షాళన దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. సాధారణంగా ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనైనా వైద్య చికిత్సలు, స్కానింగ్ సేవలు, పరీక్షలు, పోస్టుమార్టం, అంబులెన్స్ సర్వీసుల నిమిత్తం వైద్య సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుంటారనే ఆరోపణలున్నాయి. సంగారెడ్డి జీజీహెచ్‌లో వైద్యసేవల విషయంలో వసూళ్లు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించకుండా అవినీతికి వ్యతిరేకంగా అధికారులు అడుగులేస్తూ వస్తున్నారు. గతంలో జిల్లా ఆస్పత్రిగా ఉన్న సమయంలో సీటీ స్కానింగ్ కోసం రూ.500తో పాటు ఓపీ వద్ద తీసుకునే టీబీ సెల్స్ స్టాప్స్ నిమిత్తం రోగుల నుంచి రూ.5 వసూలు చేసేవారు. రెండేళ్ల కిందట జిల్లా ఆస్పత్రి నుంచి జనరల్ ఆస్పత్రికి మారిన తర్వాత వాటన్నింటికీ జీజీహెచ్ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఈ మధ్యనే పోస్టుమార్టం వద్ద వైద్య సిబ్బంది కొందరు బాధితుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు రావడంతో చర్యలకు ఉపక్రమించారు. శవపరీక్షకు వచ్చే బాధితుల నుంచి సామగ్రి కోసం సిబ్బంది రూ.2500, వైద్యులు కూడా సంబంధిత స్టేషన్ పోలీసుల ద్వారా కేసును బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారని కొందరు బాధితులు ఆస్పత్రి అధికారుల దృష్టికి తెచ్చారు. అంతేకాకుండా శవ పరీక్ష అనంతరం డెడ్‌బాడీని స్వస్థలాలకు చేర్చే పార్థివ వాహన సేవలు కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నప్పటికీ, అక్కడ కూడా రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో పోస్టుమార్టం గది వద్ద ప్రత్యేకంగా సోమవారం ఫ్లెక్సీని ఏర్పాటు చేయించారు. ఆస్పత్రిలో అన్ని సేవలు ఉచితమని, ఏ ఉద్యోగికి డబ్బు చెల్లించవద్దని, ఏ ఉద్యోగి ఏదైనా సేవ కోసం డబ్బు అడిగితే 9121363849 నంబరుకు ఫిర్యాదు చేయాలంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఉచిత పార్థివ వాహనం కోసం ఏర్పాటు చేసిన బోర్డులో 7569026145 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా తీసుకున్న చర్యలకుగాను ఆస్పత్రి అధికారులను పలువురు అభినందిస్తున్నారు.




ఉచిత పార్థివ వాహన సేవల కోసం సంప్రదించాలని ఏర్పాటు చేసిన బ్యానర్




సంగారెడ్డిలోని జీజీహెచ్ పోస్టుమార్టం ఎవరికీ డబ్బు ఇవ్వొదంటూ ఏర్పాటు చేసిన బోర్డు

### అవినీతికి ఆస్కారం లేకుండా సేవలు



సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అన్ని సేవలు ఉచితంగా పొందవచ్చు. ఎవరికీ నయాపైసా డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా పోస్టుమార్టం, డెలివరీకి వచ్చే బాధితులు అప్రమత్తంగా ఉండాలి. పోస్టుమార్టానికి అవసరమయ్యే సామగ్రి ఆస్పత్రే సమకూరుస్తుంది. ఎవరైనా డబ్బు అడిగితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. విచారణ చేసి సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకుంటాం. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు మాతో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు.

- అనీల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి

# పారిశ్రామికవాడ మద్దతు ఎవరికో?

- వలస కార్మికుల ఓట్లపై పార్టీల ఫోకస్
- ఇతర ప్రాంతాల ఓటర్ల ఆదరణపై ఆశలు

జిన్నారం, మే 6 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేది సమీపిస్తున్న వేళ నియోజకవర్గంలో ఉన్న పారిశ్రామికవాడల్లోని ఇతర ప్రాంతాల కార్మికుల మద్దతు ఎవరికి లభిస్తుందోననే ఆసక్తి నెలకొన్నది. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పటాన్‌చెరు నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు 4,10,170 మంది ఓటర్లు ఉండగా, వీరిలో స్థానికేతరులు అధిక శాతంలో ఉన్నారు. నియోజకవర్గంలోని జిన్నారం పారిశ్రామికవాడ ఎవరిని ఆదరిస్తుందో చూడాలి. పారిశ్రామికవాడ పరిధిలో ఇప్పటికే మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు రోడ్‌షోలను నిర్వహించారు. నియోజకవర్గంలో స్థానికులతో పాటు.. ఇతర ప్రాంతాల వారి ఓట్లు భారీగానే ఉన్నాయి. నియోజకవర్గంలో ఉన్న ఓటర్లలో సుమారు 40 శాతం వలస కార్మిక కుటుంబాలే ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులే అభ్యర్థుల భవిష్యత్‌ను నిర్ణయించే పరిస్థితులు ఉండడంతో అభ్యర్థులు వారిని ఆకట్టుకునే పనిలో ఉన్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిన్నారం మండలంలోని బొల్లారం, గడ్డపోతారం, కాజీపల్లి, బొంతపల్లి, అన్నారం, దోమడుగు, గుమ్మడిదల ప్రాంతాలలో అధికశాతం ఇతర ప్రాంతాల ఓటర్లే ఉన్నారు.

### వలస ఓటర్లపై అన్ని పార్టీల నమ్మకం

ఉమ్మడి జిన్నారం మండలంలో మొత్తం 87,522 మంది ఓటర్లు ఉండగా...వీరిలో పది పారిశ్రామికవాడల్లో సుమారు 50 వేల వరకు ఇతర ప్రాంతాల వారే ఉన్నారు. గ్రామాలలో 37 వేల మంది వరకు ఓటర్లు ఉండగా.. బొల్లారం మున్సిపాలిటీలోనే 30 వేల మందికి గాను 20 వేల వరకు ఇతర ప్రాంతాల వారే ఓటర్లు. ఇక స్థానికంగా నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాల కార్మికుల ఓటర్లపై అన్ని పార్టీలు నమ్మకంగా ఉన్నాయి. ముఖ్యంగా జాతీయపార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీల గుర్తులు దేశంలోని అన్ని ప్రాంతాల వారికి సుపరిచితం కాగా అభ్యర్థి కన్నా ఆయా గుర్తులే తమకు కలిసి వస్తాయని రెండు జాతీయ పార్టీలలో ధీమా నెలకొన్నది. గత అసెంబ్లీ ఎన్నికలలో పారిశ్రామిక వాడల్లో జాతీయ పార్టీలకు వచ్చిన ఓట్లశాతాన్ని వీరు ఉదహరిస్తున్నారు. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా వలస కార్మికుల ఓట్లపై భారీ ఆశలు పెట్టుకున్నది. ఇక్కడ నివాసం ఉండే అన్ని రాష్ట్రాల వారికి తమ హయాంలో ఎలాంటి వివక్ష లేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందించామని ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ అభ్యర్థులు ఇప్పటికే బైక్‌ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లతో పారిశ్రామిక ఓటర్ల మద్దతు కోసం ప్రచారం జరిపారు. ఉపాధి కోసం వచ్చిన స్థానికేతరులు ఎవరికి మద్దతుగా నిలుస్తారో ఆసక్తి నెలకొన్నది.






# డిక్కీలో పేలుడు పదార్థాలు.. పేలిన స్కూటర్

- టిక్యా తండాలో ఘటన

శివ్వంపేట, మే 6 : స్కూటర్ డిక్కీలో ఉంచిన నిషేధిత పేలుడు పదార్థాలు ఉంచగా ఆ స్కూటర్ పేలిపోయిన సంఘటన సోమవాం మండల పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడెం పంచాయతీ పరిధిలోని టిక్యా తండాకు చెందిన ఓ వ్యక్తి అడవి పందుల వేట కోసం తీసుకువచ్చిన పేలుడు పదార్థాలను స్కూటర్ డిక్కీలో ఉంచాడు. ప్రమాదవశాత్తు ఆ స్కూటర్ పేలిపోయింది. ఘటన సమయంలో స్కూటర్ దగ్గర ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

# సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్‌కు రాజీనామా

సంగారెడ్డి రూరల్, మే 6 : సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రభుగౌడ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీలో కొందరు నాయకుల తీరుతో తాను మనస్థాపానికి గురై బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశానని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో ఎలాంటి కార్యక్రమాలకు తనను ఆహ్వానించకుండా దూరం పెడుతూ వచ్చారని, తనతో పాటు మల్లికార్జున్‌పాటిల్, జమీర్‌బాబు, శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, వెంకటేశ్‌యాదవ్, కృష్ణ, కిషన్, శ్రీనులు రాజీనామా చేసినట్టు ప్రకటించారు. తాము భవిష్యత్తులో ఏపార్టీలోకి వెళ్లేది త్వరలో కార్యాచరణను ప్రటిస్తామని ప్రభుగౌడ్ పేర్కొన్నారు.


గజ్వేల్‌లో రూ.2 లక్షలను సీజ్ చేస్తున్న పోలీసులు

## వాహనాల తనిఖీలో రూ.2 లక్షలు సీజ్

గజ్వేల్, మే 6: గజ్వేల్ మండల పరిధిలోని ముక్తమాసాన్‌పల్లి చౌరస్తా వద్ద గల బేగంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట గల చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. తొగుట సీఐ లతీఫ్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా గజ్వేల్ పట్టణానికి చెందిన ఎస్.శ్రీనివాస్ తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2 లక్షలను సీజ్ చేసినట్లు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని జగదేవ్‌పూర్ రోడ్డులో అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. బూరం మల్లేశం తన వాహనంలో తీసుకెళ్తున్న రూ.55,000, లాల్‌గడి మలక్‌పేటకు చెందిన శిలాసాగర్ సిద్ధులు తీసుకెళ్తున్న రూ.68,500 నగదును సీజ్ చేశారు.

**టేక్మాల్‌లో రూ.1,21,700 లక్షలు..**

టేక్మాల్, మే 6: టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచ శివారులో ఏర్పాటుచేసిన బీజేపీ ఆఫీస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సంగారెడ్డికి చెందిన అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద రూ.71,500 వేలు, అలాగే అతని డ్రైవర్ ఫారిద్ వద్ద రూ.50,200 వేల నగదు పట్టుబడిందని ఎస్ఐ మురళి తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌చేసి, వారికి రసీదు అందజేశారు.

**చిన్నకోడూరులో రూ.1,11,400 లక్షలు..**

చిన్నకోడూరు, మే 6: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చిన్నకోడూరు మండలం అనంతసాగర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి ఎస్ఎస్‌టీ టీం, పోలీసులు కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కొండపాక మండలం ఎర్రవల్లికి చెందిన సుంచు రాజు కారులో కరీంనగర్ నుంచి సిద్దిపేటకు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1,11,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి ఉన్నారు.

## రసాయన పరిశ్రమలో ప్రమాదం, ఇద్దరికి గాయాలు

జిన్నారం, మే 6: రసాయన పరిశ్రమలో సాల్వెంట్ మిక్సింగ్ చేసే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. జిన్నారం మండలం గడ్డపోతారం పరిధిలోని ఓ రసాయన పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో రియాక్టర్ వద్ద సాల్వెంట్ మిక్సింగ్ చేసే క్రమంలో ఘాటైన వాయువులు వెలువడి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కార్మికులు కిందపడ్డారు. తీవ్రగాయాలైన కార్మికులను పరిశ్రమ ప్రతినిధులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదం, కార్మికుల గాయాల విషయాన్ని పరిశ్రమ యాజమాన్యం రహస్యంగా ఉంచినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా నర్సాపూర్‌లో ప్రచారం చేస్తున్న సునీతారెడ్డి


బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కోసం నర్సాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఆయన కుమారుడు భరత్‌రాజ్‌రెడ్డి


చిన్నశంకరంపేట మండలం సంకాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

# ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి
- పలు మండలాల్లో ఎన్నికల ప్రచారం

నర్సాపూర్/కౌల్దారం, మే 6: అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో పలు వార్డుల్లో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించి, మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు తప్ప ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. వెంకట్రామారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తే.. ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతారని సునీతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ అనసూయ, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌల్దారం మండలంలోని కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్, అంసాన్‌పల్లి, వసురాంతండా, పోతంశెట్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘమాలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

**తండ్రి కోసం కొడుకు ప్రచారం..**

నర్సాపూర్, మే 6: బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపు కోసం ఆయన కుమారుడు భరత్‌రాజ్‌రెడ్డి సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన తండ్రికి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

**చిన్నశంకరంపేటలో మాజీ ఎమ్మెల్యే ప్రచారం..**

చిన్నశంకరంపేట, మే 6: కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం చిన్నశంకరంపేట ఉమ్మడి మండలంలోని ఖాజాపూర్, ఖాజాపూర్ తండా, సంకాపూర్, సంకాపూర్ తండాలో ఉపాధిహామీ కూలీల వద్దకెళ్లి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లి, సూరారం తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఏకే గంగాధర్‌రావు, మాజీ ఎంపీటీసీ అంజాగౌడ్ పాల్గొన్నారు.

**మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో ప్రతాప్‌రెడ్డి పర్యటన**

గజ్వేల్, మే 6: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పర్యటించారు. పునరావాస కాలనీలోని పల్లెపహాడ్ గ్రామంలో ఇంటింటికి తిరిగి వెంకట్రామారెడ్డికి ఓటేయాలని అభ్యర్థించారు. ఆయనవెంట ఏటిగడ్డ కిష్టాపూర్ మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. అలాగే గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా జడ్పీటీసీ పంగ మల్లేశంతో కలిసి మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు. వారివెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెండే మధు, వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్, మండల సమన్వయ కమిటీ సభ్యులు ఉన్నారు.

**మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలి**

మర్కుక్, మే 6: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మూడు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలు ఉన్నా.. మాదిగలకు ఒక్క స్థానం కేటాయించకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు మాదిగ సమాజం ఓటుతో బుద్ధి చెప్పాలని టీ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు పొన్నాల కుమార్ మాదిగ అన్నారు. సోమవారం మర్కుక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం మర్కుక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల ఇన్‌చార్జి బాలకృష్ణ, నియోజకవర్గ నాయకులు గంగాల మల్లేశం, బోనాల నర్సింహులు పాల్గొన్నారు.

**వెంకట్రామారెడ్డికి మద్దతుగా..**

జగదేవ్‌పూర్, మే 6: మండలంలోని బస్వాపూర్, దౌలాపూర్ గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


గజ్వేల్ పట్టణంలోని మల్లన్నసాగర్ పునరావాస కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి

**బీఆర్ఎస్ విజయం ఖాయం: జడ్పీటీసీ**

మర్కుక్, మే 6: మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ గ్రామంలో వెంకట్రామారెడ్డిని గెలిపించాలని జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మేకల కనకయ్య, ఎంపీటీసీ గోలి నరేందర్ తదితరులు సోమవారం ప్రచారం నిర్వహించారు.

●**జిన్నారం:** జిన్నారం మండలం అండూరు గ్రామ శివారులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు ఖదీర్, సురేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

●**గుమ్మడిదల:** గుమ్మడిదల మండలం వీరారెడ్డి పల్లెలో వెంకట్రామారెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ మండల నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు టీజేఎస్ సంపూర్ణ మద్దతు

- రాజ్యాంగ పరిరక్షణ కోసం హస్తానికి ఓటేయండి
- తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం


సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం

సంగారెడ్డి అర్బన్, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జన సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం తెలిపారు. సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ పదేళ్ల హయాంలో దేశంలో ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయ రంగంలో 2022 నాటికి రైతుల ఆదాయాన్ని మోదీ సర్కారు రెట్టింపు చేస్తామని ప్రకటించినప్పటికీ, వాస్తవానికి రైతుల ఆదాయం 10 శాతం తగ్గిందన్నారు. దేశ వ్యాప్తంగా రైతులు 50 శాతం మంది అప్పుల పాలయ్యారని, దాదాపు లక్షా 70 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని దుయ్యబట్టారు. ఎరువులపై సబ్సిడీ దాదాపు 40 శాతం తగ్గిపోయిందన్నారు. మద్దతు ధరను చట్టబద్ధం చేయలేకపోయిందని ఆరోపించారు. రైతులకు వ్యవసాయం భారంగా మారిందన్నారు. 2014-23 మధ్యలో నిరుద్యోగ సమస్య 2 నుంచి 8 శాతానికి పెరిగిందన్నారు. నోట్ల రద్దుతో పెద్ద, చిన్నతరహా పరిశ్రమలు నడవలేని దుస్థితికి చేరాయన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, భావోద్వేగాలు రెచ్చగొట్టేలా విధ్వంసకర ప్రసంగాలు చేయడం, ఇంకా అవకాశమిస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామంటున్నారని ఆరోపించారు. కార్పొరేట్ రంగానికి ఊడిగం చేసే ఆలోచనలో బీజేపీ ఉన్నదని, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి, ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆశప్ప, జిల్లా అధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి పాతదొడ్డి తుల్జారెడ్డి, నాయకులు లక్ష్మీ, రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిలు, పాండు తదితరులు పాల్గొన్నారు.

# మీ బిడ్డగా వచ్చా.. ఆశీర్వదించండి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


చిన్నకోడూరులో ప్రచారం నిర్వహిస్తున్న కర్ణాటక ఇన్‌చార్జి ఎంజే దినేష్, తదితరులు

వెల్దుర్తి, మే 6: మీ బిడ్డగా వచ్చాను.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి.. ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో నిర్వహించిన రోడ్ షోలో రఘునందన్‌రావు ప్రజలకు అభివాదం తెలుపుతూ ఓట్లు వేయాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం విఫలమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నర్సింములు, బీజేపీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీయాదవ్, వెల్దుర్తి మండల ఇన్‌చార్జి బుచ్చేష్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

**భారీ మెజార్టీతో గెలిపించాలి: కర్ణాటక ఇన్‌చార్జి**

చిన్నకోడూరు, మే 6: రఘునందన్ రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కర్ణాటక ఇన్‌చార్జి (ఆలిండియా కాఫీ బోర్డు చైర్మన్) ఎం.జె. దినేష్ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ సంతోష్ కుమార్, మండలాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు: జడ్పీటీసీ**

నిజాంపేట, మే 6: ప్రధాని నరేంద్రమోదీ దేశానికి చేస్తున్న సేవలకు, పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై పార్టీలో చేరుతున్నారని జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ అన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాసాయిపేట పార్లమెంట్ కార్యాలయంలో రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

**కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి**

ములుగు, మే 6: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు స్వామిగౌడ్ పేర్కొన్నారు. సోమవారం ములుగు మండలం బైలంపూర్, తానెదార్‌పల్లి, మామిడాల, తున్కిబొల్లారం గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


వెల్దుర్తిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

●**కౌల్దారం:** మండల కేంద్రమైన కౌల్దారంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి రఘునందన్ రావును గెలిపించాలని బీజేపీ శ్రేణులు సోమవారం ప్రచారం నిర్వహించారు.

●**గజ్వేల్:** గజ్వేల్ మండలం గిరిపల్లిలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీజేపీ గజ్వేల్ అసెంబ్లీ కోకన్వీనర్ మహేశ్, ఇతర బీజేపీ నాయకులు ఉపాధిహామీ కూలీల వద్దకెళ్లి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు.

**బీజేపీలో చేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

నర్సాపూర్, మే 6: నర్సాపూర్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీ మాజీ అసెంబ్లీ కన్వీనర్ వి.మల్లేశ్‌గౌడ్, అరవింద్‌గౌడ్ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కుమార్‌తో పాటు నాగరాజు, సత్యనారాయణ, నవీన్ బీజేపీలో చేరారు.

# అభ్యర్థిపై దుష్ప్రచారం చేస్తున్న వారిని శిక్షించాలి

- పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

పటాన్‌చెరు, మే 6: బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రవీణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీధర్‌చారి మాట్లాడుతూ మార్ఫింగ్ వీడియోలు, వాయిస్‌లతో తమ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై అభ్యంతకరమైన దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్న డీప్ ఫేక్ వీడియోలు, క్లిప్పింగ్‌లపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ తదితరులు

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి


వినోద్‌కుమార్(ఫైల్)

కోహీర్, మే 6: మైనింగ్ కోసం తీసిన నీటి గుంతలో పడి యువకుడు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కొత్తూరు(డీ) గ్రామానికి చెందిన ఎలబండి వినోద్‌కుమార్(22), ఎలబంటి మధు, పెద్దచెల్మెడ, మేలసంఘం కంకోల్ గ్రామాలకు చెందిన జగదీశ్వర్, అంజి, శివ, శ్రీకాంత్ ఆదివారం గ్రామ సమీపంలోని కంకర మైనింగ్ వద్ద దావత్ చేసుకునేందుకు వెళ్లారు. దావత్ అనంతరం సమీపంలో నీటితో నిండి ఉన్న మైనింగ్ గుంతలో ఈత కొట్టేందుకు వెళ్లారు. గుంతలోకి వినోద్‌కుమార్, మధు దిగారు. గుంత లోతు ఎక్కువగా ఉండడం, ఇద్దరికీ ఈత సరిగ్గా రాకపోవడంతో నీట మునిగారు. ఒడ్డున ఉన్న మిగతా స్నేహితులు గమనించి మధును కాపాడారు. వినోద్‌కుమార్ లోపలికి వెళ్లడంతో తీసేందుకు వీలుకాలేదు. ఈ విషయాన్ని గ్రామస్థులకు, పోలీసులకు తెలియజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వినోద్‌కుమార్ కోసం గాలించారు. ఆదివారం సాయంత్రం కావడంతో వెళ్లిపోయారు. సోమవారం ఉదయం గజ ఈతగాళ్ల సహాయంతో వినోద్‌కుమార్ మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టు మార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**నీటి మడుగులో పడి బాలుడు..**

కౌల్దారం, మే 6: ప్రమాదవశాత్తు మంజీరాలోని నీటి మడుగులో స్నానానికి దిగిన బాలుడు మృతిచెందిన సంఘటన కౌల్దారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకున్నది.


దుర్గేష్ మృతదేహం

కౌల్దారం ఎస్ఐ మహ్మద్ గౌస్ వివరాల ప్రకారం.. కొడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామానికి చెందిన భూమేష్, యశోద దంపతులకు ఇద్దరు కుమారులు దుర్గేష్, రాజు ఉన్నారు. సోమవారం ఉదయం ఏడుపాయల దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. మంజీరాలో స్నానం చేసేందుకు నలుగురు నీటి మడుగులోకి దిగారు. లోతుగా ఉన్నచోట దుర్గేష్(14) స్నానం చేస్తుండగా ఈత రాక నీటిలో మునిగిపోవడంతో ఊపిరాడక ప్రాణాలు వదిలాడు. కళ్లెదుటే కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఎస్ఐ మహ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దేశ భద్రత బీజేపీతోనే సాధ్యం: రాజాసింగ్


జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్


జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

జహీరాబాద్, మే 6: దేశ భద్రత కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలో సిద్ధి హోటల్ నుంచి శివాజీ విగ్రహం వరకు రోడ్‌షో నిర్వహించారు. దేశవ్యాప్తంగా ప్రజలు మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చూడాలనుకుంటున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉగ్రవాదాన్ని పెంపొందించే విధంగా ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. అనంతరం జహీరాబాద్ ఎంపీఅభ్యర్థి బీబీపాటిల్ మాట్లాడుతూ మోదీ హయాంలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి మాట్లాడారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొల్ల భాస్కర్ బీజేపీలో చేరారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టంలోని ఆదర్శనగర్, హనుమాన్‌మందిర్, దత్తగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

**దేశం, ధర్మం కోసం బీజేపీ పనిచేస్తుంది**

దేశంకోసం, ధర్మం కోసం, న్యాయం కోసం బీజేపీ పనిచేస్తున్నదని జహీరాబాద్ పార్లమెంటరీ ప్రభారీ గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన పదేళ్లలో నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు.

**బీజేపీతోనే దేశాభివృద్ధి**

పెద్దశంకరంపేట, మే 6: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ తెలిపారు. పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయం వద్ద పట్టణానికి చెందిన పలు యువజన సంఘాలకు చెందిన 100కు పైగా యువకులు, రామోజీపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సాయిలుతో పాటు దాదాపు 50 మంది సోమవారం విఠల్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీజేపీ మండల నాయకులు సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

**బీజేపీలో చేరిన సిర్గాపూర్ జడ్పీటీసీ**

కల్హేర్, మే 6: సిర్గాపూర్ జడ్పీటీసీ రాఘవరెడ్డితో పాటు సొంత గ్రామమైన సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, భూంరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో సహా 80 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు బీజేపీలో చేరారు. బీబీ పాటిల్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్ రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఖేడ్‌లో బీరు నోస్టాక్..!

నారాయణఖేడ్, మే 6: వేసవిలో మద్యం ప్రియులు బీరుకు ప్రాధాన్యమిస్తారు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్న పలువురు బీర్ల కోసం వెళ్తే ఖేడ్ పట్టణంలోని పలు మద్యం దుకాణాల ముందు బీరు స్టాకు లేదనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు. ఎండలతో పాటు బీరుకు భారీగా డిమాండ్ పెరగడంతో ఇదే అదునుగా భావించిన మద్యం దుకాణాల వారు సిండికేట్‌గా మారి ఎక్కువ ధరకు గొలుసు దుకాణాల వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మద్యం దుకాణాల్లో బీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.



ఖేడ్‌లో బీరు స్టాకు లేదని వేలాడదీసిన బోర్డు

## కంకర క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


అధికారికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

హత్నూర, మే 6: నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తున్న కంకర క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని హత్నూర గ్రామస్థులు సోమవారం సంగారెడ్డిలోని మైనింగ్ ఏడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబరు 116లో 16 ఏళ్ల నుంచి కంకర క్రషర్ యాజమాన్యం అనుమతుల కంటే ఎక్కువ తవ్వకాలు జరుపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుందన్నారు. ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు చేయడంతో పరిసర గ్రామాలైన హత్నూర, నాగుల్‌దేవులపల్లి, బ్రాహ్మణగూడ గ్రామాల్లో వ్యవసాయ బోర్లు దెబ్బతిని వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇళ్లు బీటలు వారడంతో పాటు రాత్రి సమయాల్లో బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తున్న కంకర క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రంలో సమర్పించినవారిలో మాజీ సర్పంచులు వీరస్వామిగౌడ్, కిష్టయ్య, మాజీ జడ్పీటీసీ ఆశయ్య, గ్రామస్థులు ఉన్నారు.

## ఎన్నికల సంఘం నియమావళి పాటించాలి

● మాస్టర్ ట్రైనర్, ఆర్డీవో జయచంద్రారెడ్డి


మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

మెదక్ అర్బన్, మే 6: మీడియా ఎన్నికల సంఘం నియమావళిని పాటించాలని మాస్టర్‌ట్రైనర్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులకు ఎంసీసీ, ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ), సోషల్ మీడియా తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా ఎంసీఎంసీకి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, రాజకీయపార్టీల ప్రకటనలకు ప్రీ సర్టిఫికేషన్ అయిన తదుపరి మాత్రమే పచురణ, పోస్ట్, ప్రసారం చేయాలని వివరించారు. అన్ని వార్తలను కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. నిబంధనలు పాటించని వ్యక్తులు, మీడియాపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు, పోలింగ్ రోజు ఏదైనా యాడ్ ఇవ్వాలి ఉంటే కచ్చితంగా మీడియా సర్టిఫికేషన్ పొందిన తర్వాత ప్రచురించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మీడియా నోడల్ అధికారి రామచంద్రరాజ్, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 6: పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డా. బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఎస్పీ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

# మాసాయిపేటలో 'ఉపాధి' పనుల జాతర

● ఉదయం 6 గంటల నుంచే చెరువుల్లో ముమ్మరంగా పూడికతీత

● పనుల్లో 600 మంది కూలీలు

● సిబ్బంది సహకరించాలని విజ్ఞప్తి


ముత్యాలమ్మ చెరువు వద్ద ఉపాధి పనుల్లో నిమగ్నమైన గ్రామస్థులు

మాసాయిపేట, మే 6: మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు జాతరను తలపిస్తున్నాయి. మండుటెండల దృష్ట్యా ఉపాధి కూలీలు ఉదయం 6 గంటల నుంచే పెద్దఎత్తున తరలివచ్చి ఉపాధిహామీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. కేటాయించిన పనులను పూర్తి చేసి ఎండ నడినెత్తిన చేరేలోపు తిరిగి ఇళ్లకు చేరుకొని సేదతీరుతున్నారు. మాసాయిపేటలోని ఊరచెరువు, ముత్యాలమ్మ చెరువు పూడికతీత పనుల్లో ఆడ, మగ అనే తేడా లేకుండా సుమారు 600 మంది వరకు ఉపాధి కూలీలు ఉత్సాహంగా పని చేస్తున్నారు. కాగా మాసాయిపేటలోని పెద్ద చెరువు, ఊర చెరువు, ముత్యాలమ్మ చెరువుతో పాటు పలు కుంటల్లో ఉపాధి పనులు దాదాపు నెల రోజులుగా కొనసాగుతున్నాయి. పూడికతీత పనుల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. గడ్డపారలు భుజాన వేసుకుని, గంపలలో మట్టిని తరలిస్తూ మగ కూలీలకు ఏమాత్రం తీసుపోకుండా పోటీపడుతూ తవ్వకాల పనుల్లో పాల్గొనడం గమనార్హం.

### సౌకర్యాల కల్పనలో జాప్యం

ముత్యాలమ్మ చెరువులో వారం రోజులుగా జరుగుతున్న మట్టి పూడికతీత పనుల్లో పాల్గొన్న మహిళలు, కూలీలు మాట్లాడుతూ ఉపాధిహామీ సిబ్బంది తమకు సరైన విధంగా సహకరించడం లేదని కొలతలతో పాటు సౌకర్యాలు కల్పనలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. సరైన కూలి సైతం లభించడం లేదని వాపోతున్నారు. ముత్యాలమ్మ చెరువు వద్ద చేపడుతున్న పనుల్లో పాల్గొంటున్న సుమారు 600 మంది ఉపాధి హామీ కూలీలు చెరువులో తీసిన మట్టిని రెండోసారి చెరువు గట్టుపైకి మోయిస్తున్నారని వాపోయారు. ఉపాధి హామీ మేట్ లు ఉపాధి హామీ పనులు చూడాల్సిన టెక్నికల్ అసిస్టెంట్ సరిగ్గా పర్యవేక్షణ చేసి తమకు కూలి విషయంలో సరిగా డబ్బులు అందేలా సహకరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు, ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కొంతాన్‌పల్లిలో రక్తదానం

శివ్వంపేట, మే 6: పీఏసీఎస్ ఛైర్మన్ కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన చింత వెంకట్రామిరెడ్డి 57వ జన్మదిన వేడుకలు సోమవారం కొంతాన్‌పల్లిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. సందర్భంగా అభిమానులతో పాటు ఆయన రక్తదానం చేశారు. జన్మదిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ తాలూకా ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ జడ్పీటీసీ కమలాపూల్‌సింగ్, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, లక్ష్మీకాంతం రావు తదితరులు పాల్గొన్నారు.



శివంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుల్‌కల్, మే 6: మండల కేంద్రమైన చౌటకూర్‌తో పాటు శివంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు సందర్శించారు. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటుగా ఇతర మౌలిక వసతుల గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్, తహసీల్దార్ ఈశ్వరిరాణి ఉన్నారు.

● కంగ్టి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని చాప్టా కె గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి, పనులు జరిగే స్థలంలో వసతులు ఏర్పాటు చేయించారు. కూలీలకు పలు సూచనలు చేశారు.

## ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఝరాసంగం, మే 6: మండల కేంద్రంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ కమాన్ వద్ద రెండు రోజులు క్రితం గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పిపోగా చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడి శరీరంపై వైట్ ఎల్లో షార్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ఉన్నాయన్నారు. ఎక్కడైన మిస్సింగ్ కేసు నమోదై ఉంటే 8712656771 నంబర్‌కు సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

## కల్హేర్‌లో రెండిళ్లలో చోరీ

కల్హేర్, మే 6: మండల కేంద్రంలో తాళాలు వేసిఉన్న రెండిళ్లలో గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. సోమవారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్హేర్‌కు చెందిన మీర్జా బేగం తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటికి వేసిన తాళాన్ని తొలగించి బీరువాలో ఉన్న ఒకటిన్నర తలాల బంగారం, రూ. 50 వేల నగదు అపహరించారు. అదే ఇంటికి సమీపంలోనే గుంజుగూరి పార్వతి అనే మహిళ తాళం వేసి ఊరికి వెళ్లగా ఆ ఇంట్లో సైతం దొంగలు చొరబడ్డారు. అయితే ఎలాంటి సొత్తు చోరీ కాలేదు. ఈ సమాచారమందుకున్న ఎస్ఐ వెంకటేశం రెండిళ్లను పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు.

## ఎన్నికల విధుల్లో ఉన్నవారికి టీఏ, డీఏ చెల్లించండి


కలెక్టరేట్‌లో ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, మే 6: ఎన్నికల విధుల్లో ఉన్నవారికి టీఏ, డీఏ చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏవో పరమేశంకు సోమవారం వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లకు ఎన్నికల నిబంధనల ప్రకారం బీఎల్‌వో, ఓటర్ స్లిప్పులను గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన అంగన్‌వాడీలు, ఆశావర్కర్లకు టీఏ, డీఏ లు చెల్లించలేదని మండిపడ్డారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో ఎన్నికల విధులు నిర్వహించే అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు టీఏ, డీఏ చెల్లించి వారిని ఆదుకోవాలని సాయిలు కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు జయరాజ్, కృష్ణ, దత్తు తదితరులు ఉన్నారు.

## బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నాని


నానికి నియామకపత్రం అందజేస్తున్న రమేష్‌గౌడ్

కొల్చారం, మే 6: కొల్చారం మండల బీజేపీ నూతన ప్రధాన కార్యదర్శిగా పోతంశెట్‌పల్లి గ్రామానికి చెందిన గుండు నాని నియామకమయ్యారు. అలాగే కొల్చారం మండల నూతన కార్యదర్శిగా ఎనగండ్ల గ్రామానికి చెందిన హర్షవర్ధన్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామకపత్రాలను రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్ సోమవారం అందజేశారు.కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాతూరి దయాకర్ గౌడ్, అన్నిగ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

విలేకరుల సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


కొల్చారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం, మే 6: 'కొంతమంది స్వార్థంతో పార్టీని వీడొచ్చు.. అది వారి వ్యక్తిగతం, దానిపై మేము ఎవరం స్పందించడం లేదు. పార్టీ నుంచి పోయినవారు పొండి, కాని పార్టీలో ఉన్నవారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, దాడులు చేస్తే ఊరుకోం' అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు. కొల్చారంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడినవారు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తలను వ్యాపారాలు ఎలా చేసుకుంటారో చూస్తామంటూ భయపెట్టడం, ఇబ్బందులకు గురిచేస్తూ ఇళ్లలోకి వెళ్లి డోర్‌లు పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో కొల్చారం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కొరబోయిన మంజుల కాశినాథ్, జడ్పీటీసీ మేఘమాల, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, సీడీసీ మాజీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ అరిగె రమేష్, మాజీ వైస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిట్యాల యాదయ్య, కొమ్ముల యాదాగౌడ్, పోతంశెట్‌పల్లి ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సిద్దిరాములు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వేమారెడ్డి, ముత్యం ప్రవీణ్‌కుమార్, రాజాగౌడ్, దుర్గాప్రసాద్‌గౌడ్, ఎండుగుల క్రిష్ణ, గౌరిశంకర్, చౌరిగారి చిన్న రాములు, సోమ నర్సింహులు, ముత్యంగారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## నీటి సమస్యపై కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, మే 6: సంగారెడ్డిలో మంచినీటి సమస్యను పరిష్కరించని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రతీ ఇంటికి సరఫరా చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంగళవారం ఉదయం పది గంటలలోపు నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారం కాని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని చింతా ప్రభాకర్ హెచ్చరించారు.

## బొల్లారంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి


బొల్లారం మీదికుంటలో అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్

జిన్నారం, మే 6: బొల్లారం మున్సిపాలిటీ మీదికుంటలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కౌన్సిలర్ గోపాలమ్మ పేర్కొన్నారు. సోమవారం బొల్లారం 2వ వార్డులోని మీదికుంట స్థలంలో చేపట్టిన నిర్మాణ పనులను కౌన్సిలర్ గోపాలమ్మ పరిశీలించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమార్కులు కుంట స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే స్థానికుల ఫిర్యాదుతో కూల్చి వేసినట్టు ఆమె తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల వేళ అధికారులు బిజీగా ఉండడంతో అక్రమార్కులు మళ్లీ నిర్మాణాలు జరుపుతున్నారని ఆమె అన్నారు. అక్రమ నిర్మాణాలను పేదలకు రూ.8లక్షల వరకు విక్రయాలు చేస్తున్నారని కబ్జాలపై స్థానిక మున్సిపల్, ఇరిగేష్ శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఆన్‌లైన్‌లో లోన్‌లు తీసుకుని ఇబ్బందులకు గురికావొద్దు

జగదేవ్‌పూర్, మే 6: స్నేహితులతో కలిసి జల్సాలు చేయడానికి ఆన్‌లైన్‌లో లోన్‌లు తీసుకుని ఇబ్బందులకు గురికావద్దని జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ సూచించారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రజలను చైతన్య పరచడానికి పోలీస్ కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. .

# కేంద్ర ప్రభుత్వ ధోరణితో నష్టపోతున్నరైతులు

● రాష్ట్ర రైతురక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు


సమావేశంలో మాట్లాడుతున్న పాకాల శ్రీహరిరావు

జహీరాబాద్, మే 6: స్వామినాథన్‌కమిటీ సిఫారసుల మేరకు రైతులకు మద్దతుధర, రైతులకు భద్రత కల్పించే విధంగా కాంగ్రెస్‌పార్టీ కృషి చేస్తుందని రాష్ట్ర రైతురక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి రాంచందర్ గౌడ్ తదితరులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో రైతులు, రైతునాయకులు నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడి దారులకు వత్తాసు పలుకుతుందని, బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని వారు ఆరోపించారు. గడిచిన పదేళ్ళకాలంలో ఆ రెండు పార్టీలు రైతులకు ఏరకంగా న్యాయం చేశారనే విషయాన్ని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. తెలంగాణలో ప్రజలు బీఆర్ఎస్ పాలన తీరుపై విసుగుచెందారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైతుసంఘం నాయకులు రాఘవేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు, రైతులు హుగ్గెల్లి రాములు, కండెం నర్సింహులు, అల్లీపూర్ అశోక్, నర్సింహారెడ్డి, శుక్లవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రామక్రిష్ణ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 8నుంచి ర్యాకల్ ఎల్లమ్మ జాతర


ఆలయంలో కొలువైన ర్యాకల్ ఎల్లమ్మతల్లి

నారాయణఖేడ్, మే 6: ర్యాకల్ ఎల్లమ్మ జాతర ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాకల్ ఎల్లమ్మకు మొక్కులు తీర్చుకుంటే చిన్నారులు వివిధ జబ్బుల నుంచి బయటపడతారని స్థానికుల్లో విశ్వాసం. దీంతో ఈ జాతరకు సంగారెడ్డి జిల్లా నలుమూలల వారే కాకుండా కర్ణాటక మహారాష్ట్రలకు చెందిన భక్తులు కూడా పెద్ద ఎత్తున తరలివస్తారు. ఈ నెల 8న బోనాల ఊరేగింపు, 9న బండ్ల ప్రదర్శన, 10న పాచిబండ్ల ప్రదర్శన, 11న చివరి పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

## బేస్‌బాల్ శిక్షణా కేంద్రం పరిశీలన


మనోహరాబాద్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో జిల్లా పీఈటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు

మనోహరాబాద్ మే 6: మనోహరాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బేస్‌బాల్ శిక్షణ కేంద్రాన్ని మెదక్ జిల్లా పీఈటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు సోమవారం పరిశీలించారు. అనంతరం వారు క్రీడాకారులతో మాట్లాడుతూ.. శిబిరంలో శిక్షణ పొందుతున్నవారు జిల్లాకే కాకుండా రాష్ట్రానికి కూడా ప్రాతినిధ్యం వహించేలా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు ఈ క్యాంపు మనోహరాబాద్‌లోని క్రీడా ప్రాంగణంలో కొనసాగుతుందన్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసు

గజ్వేల్, మే 6: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా ఎరువులు, విత్తనాల దుకాణాలను గజ్వేల్ మండల వ్యవసాయాధికారి నాగరాజుతో కలసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో విత్తనాల నిలువలను, స్టాక్ రిజిస్టర్ ఎంట్రీలతో సరిచూశారు. డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు.

# ఉపాధి కూలీలకు ప్రమాద బీమా కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి

కొండాపూర్, మే 6: ఉపాధిహామీ కూలీలకు రూ.10 లక్షల ప్రమాద బీమా, బకాయిపడ్డ కూలీ డబ్బులను 15 రోజులలోపు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం మండల కమిటీ అధ్వర్యంలో తెర్పోల్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశాల్లో పర్యటించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు సమ్మర్ అలవెన్స్, ప్రమాద బీమా సౌకర్యం, భూమి లేని రైతులకు రైతు భరోసా మాదిరి సంవత్సరానికి రూ.50వేల చెల్లించాలన్నారు. రెండు నెలలుగా కూలీ డబ్బులను చెల్లించకపోవడం దారుణమని, ఉపాధి సిబ్బంది నిర్లక్ష్య పని తీరుకు ఇది నిదర్శనమన్నారు.పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు కచ్చితంగా ఉంచాలన్నారు. పని చేసే సమయంలో కూలీలు గాయపడినా లేదా వడ దెబ్బ తగిలినా దిక్కులేని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఉపాధి హామీలో జియో ట్యాగ్ పెట్టొదని, ఏడాదికి 200 రోజుల పని దినాలు, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలీ రూ.800 చెల్లించాలని ఆ సంఘం మండల కార్యదర్శి రాజయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, హనుమంతు, అశోక్, రాములు, వినోద, సుగుణమ్మ, కిష్టయ్య, రాజు తదితరులు ఉన్నారు.

## భక్తి మార్గం వైపు పయనించాలి


భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేస్తున్న కరణ్‌మహరాజ్

కల్హేర్, మే 6: ప్రతీ మానవుడు భక్తి మార్గం వైపు పయనించాలని, అప్పుడే దుర్గుణాలు దూరమవుతాయని అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్ ఉద్బోధించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని చాప్టా, ఉజలంపాడ్ గ్రామాల శివారులోని సీతారాం తండాలో నిర్వహించిన సీమాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా సోమవారం ఆయన వందలాది మంది భకుల్తనుద్దేశించి ప్రవచన కార్యక్రమం జరిగింది. సమాజంలో చెడు దరికి చేరవద్దంటే భక్తి మార్గం ఒక్కటే మానవులకున్న ఏకైక మార్గమన్నారు. దీని ద్వారా చెడు వ్యసనాలకు దూరమై మానవుడు పునీతమవుతాడన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా సాయికుమార్


నియామక పత్రాన్ని అందుకుంటున్న సాయికుమార్

హత్నూర: ఎన్ఎస్‌యూఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన వల్లిగారి సాయికుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు భవంత్ రెడ్డి సోమవారం నాడు నియామాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని అన్నారు.

## డిజైర్ సొసైటీలో ఉత్సాహంగా వేసవి శిబిరం


చిన్నారులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న సీఐ గంగాధర్

జిన్నారం, మే 6: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు డిజైర్ సొసైటీ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని బొల్లారం సీఐ గంగాధర్ అన్నారు. బొల్లారం డిజైర్ సొసైటీలో సోమవారం నిర్వహించిన వేసవి శిబిరం మూడో రోజు కార్యక్రమంలో భాగం గా సంస్థలోని చిన్నారులకు సీఐ గంగాధర్ చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ నెల 6తో వేసవి శిబిరం ముగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.





# వైభవంగా బసవేశ్వర విగ్రహావిష్కరణ


రేగోడులో బసవేశ్వర విగ్రహావిష్కరణ చేస్తున్న పీఠాధిపతులు, గ్రామంలో భక్తుల శోభాయాత్ర

రేగోడు మే 5: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని బిచ్కుంద పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహరాజ్, బాల్కి బసవ కళ్యాణ్ పీఠాధిపతి బసవలింగ పట్టాదేవరులు పేర్కొన్నారు. సోమవారం రేగోడులో విశ్వగురు మహాత్మా శ్రీ బసవేశ్వర ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటంతో 108 కళశాలతో మహిళలు, పెద్దలు, పిల్లలు రేగోడ గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బసవేశ్వర విగ్రహాన్ని పీఠాధిపతులు సోమలింగ శివాచార్య మహరాజ్, బసవలింగ పట్టాదేవరులు ఆవిష్కరణ చేశారు. జ్యోతి ప్రజ్వాన, జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరారు. దైవచింతనతోనే మనశ్శాంతి చేకూరుతుందని, అందరూ బసవేశ్వరుని అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్, శ్రీనివాస్, గుండప్ప పాల్గొని పూజలు నిర్వహించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్నవారికి రేగోడు వీరశైవ లింగాయత్ సంఘం తరఫున సన్మానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

చిన్నశంకరంపేట, మే 6: మండలంలోని గవ్వపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌడసంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, పూజలు, దంపతులు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నర్సాగౌడ్, బాలకిషన్‌గౌడ్, యాదాగౌడ్, సిద్దాగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు


రెడ్డిపల్లిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన మాజీ ఉపసర్పంచ్

నర్సాపూర్, మే 6: రెడ్డిపల్లి ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. సోమవారం ఆయన తన కొడుకు శ్రీకర్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా ఆర్భాటం చేసి డబ్బు వృథా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు అభినందించారు. మండుటెండల నేపథ్యంలో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్టు ఉపసర్పంచ్‌అశోక్ గౌడ్ వివరించారు.